ప్రతీ ఎకరాకు.. సాగునీరు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- రెండేళ్లలో పీఆర్‌ఎల్‌ఐ, పేట- కొడంగల్ పథకాలతో సాగునీరు
- పరిశ్రమలు, ఐటీ హబ్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు
- నా వ్యక్తిత్వం, చిత్తశుద్ధిలో తప్పులు దొరక్క నాన్‌లోకల్ డ్రామాలు
- కాంగ్రెస్ ప్రాజెక్టులు కడితే.. తాను తెచ్చానని అరుణ ప్రగల్బాలు
- పాలమూరు ప్రజల సహకారంతో రెండు లక్షల మెజారిటీతో విజయం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'పాలమూరులో సాగుకు యోగ్యమైన ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు, రెండేళ్లలో పాలమూరు- రంగారెడ్డి, మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాలు కృషి చేస్తా. పార్లమెంట్ పరిధిలో ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం కల్పించేందుకు పరిశ్రమలు, టూ టైర్ ఐటీ హబ్‌లను డెవలప్ చేస్తా. నారాయణపేటకు దక్కకుండా పోయిన సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయిస్తా. అన్ని సమస్యలు పరిష్కరించి, పార్లమెంట్‌లో పాలమూరు గొంతును వినిపిస్తా. పాలమూరు ప్రజల సహకారంతో రెండు లక్షల మెజారిటీతో విజయం సాధిస్తా' అని అంటున్నారు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న : ప్రచారం ఎలా సాగుతోంది.. విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

వంశీచంద్ : పాలమూరు పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం బ్రహ్మాండంగా సాగుతోంది. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనను హర్షిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అండగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. ముదిరాజులు బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'కు మార్పు, మంత్రి పదవి హామీతో సంతోషంగా ఉన్నారు. గొల్లకురుమలతో డీడీలు కట్టించుకుని కేసీఆర్ మోసం చేస్తే.. వాటిని వాపస్ ఇచ్చి రేవంత్ సర్కారు సహకరించిందనే అభిప్రాయంతో ఉన్నారు.

ప్రశ్న : పాలమూరులో ప్రాజెక్టులను తానే తెచ్చానని డీకే అరుణ అంటున్నారు..

వంశీచంద్ : ఉమ్మడి పాలమూరులో ప్రతీ ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలో వచ్చిందే. ఆ ప్రాజెక్టులు వచ్చినప్పుడు అరుణమ్మ కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. నీడ కోసం కుక్క బండి కింద నడుస్తూ.. తానే బండి బరువును మోసిందన్న చందంగా అరుణమ్మ మాట్లాడుతున్నారు. రాజకీయ అవసరాలకు కాంగ్రెస్ పార్టీలో చేరి.. జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రి పదవులను అనుభవించి, బీజేపీకి అమ్ముడుపోయారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉండి రైల్వే పాసేజ్‌లు తెచ్చిందా?.. రైల్వేలైన్ తెచ్చిందా?.. సైనిక్ స్కూల్ పోతుంటే అడ్డుకుందా?.. పీఆర్‌ఎల్‌ఐకి జాతీయ హోదా తెచ్చిందా?.. కృష్ణా జలాల్లో రావాల్సిన 570 టీఎంసీల వాటా కోసం పీఎం మోదీని అడిగిందా? అరుణమ్మ సమాధానం చెప్పాలి.

ఆడపడుచును ఓడించడానికి కుట్ర చేస్తున్నారని అంటున్నారు కదా.. మీరేమంటరు?

శాసనసభలో గౌరవ స్పీకర్ స్థానంలో ఉన్న పద్మా దేవేందర్‌రెడ్డిని ఆరోజు సంస్కారం లేని వ్యక్తి అని చెప్పి.. ఆమె కంటతడి పెట్టుకున్నప్పుడు ఆడపడుచు అని గుర్తుకు రాలేదా? ఒక ఆడపడుచు సరితమ్మ పోటీ చేస్తే.. అల్లుడి కోసం బోయ వాల్మీకి బిడ్డను నిలబెట్టి, ఆయనకు ఓట్లు పడకుండా వెన్నుపోటు పొడిచినప్పుడు సరితమ్మ ఆడపడుచు అని గుర్తుకు రాలేదా? ఒక ఇంటర్వ్యూలో చేతకాకపోతే గాజులు తొడుక్కోండి అంటూ మహిళలను కించపరిచేలా మాట్లాడిన అరుణమ్మ.. ఆడపడుచును ఓడించడానికి కుట్ర చేస్తున్నారనడం హాస్యాస్పదంగా ఉంది.



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

ప్రశ్న : మీరు నాన్ లోకల్.. తాను లోకల్ అంటున్నారు ఎలా చూస్తారు?

వంశీచంద్ : నాది షేరి అప్పారెడ్డిపల్లి, కల్వకుర్తి నియోజకవర్గం. నేను పాలమూరు బిడ్డగా ఇక్కడ పోటీ చేస్తున్నా. గద్వాలలో సరిత అభ్యర్థిగా నిల్చుంటే ఆమె నాన్‌లోకల్ అని డీకే అరుణ చెప్పారు. అదే డీకే అరుణ పాన్‌గల్‌లో జడ్పీటీసీగా గెలిచినప్పుడు అక్కడ లోకల్.. గద్వాలలో ఎమ్మెల్యేగా ఉంటే అక్కడ లోకల్.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఇక్కడ లోకల్. అంటే ఆమెకు మూడు అవతారాలు ఉన్నాయా? నాన్ లోకల్ అనే దానికి కొలబద్ద ఏంటి? నరేంద్రమోదీ వారణాసిలో, ఈటల రాజేందర్ మల్కాజిగిరిలో లోకలా? ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుంది. నా వ్యక్తిత్వం, రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవలో చిత్తశుద్ధిలో తప్పులు లేక.. నాన్ లోకల్ అని డ్రామా చేస్తున్నారు. ఆమె సెల్ఫ్ గోల్ అయ్యింది.



ప్రశ్న : జీవో 69ని అరుణమ్మ అడ్డుకుందని రేవంత్‌రెడ్డి అన్నారుగా.. అందులో నిజమెంత?

వంశీచంద్ : జీవో 69ని అమలు చేసేందుకు అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రయత్నిస్తే ముమ్మాటికీ అరుణమ్మ అడ్డుకుంది. సైనిక్ స్కూల్ నారాయణపేట నుంచి పోతుంటే వేడుక చూశారు. భారత్‌మాల రహదారిలో నిర్వాసితులు అడ్డుకుంటే వారికి అన్యాయం చేశారు. ఆమె తండ్రి పేరుతో ఉన్న సంగంబండ వద్ద బండ పగులగొట్టకుండా అడ్డుకున్నారు. ఇవాల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితులకు న్యాయం చేసింది నేను. 1.30 లక్షల ఎకరాలకు నీరిచ్చే మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ.4 వేల కోట్లతో మంజూరు చేశాం. రెండేళ్లలో ఈ పథకం పూర్తి చేసి, ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే అనే ఆరోపణల్లో వాస్తవమెంత?

ముమ్మాటికీ బీఆర్‌ఎస్-బీజేపీ ఒక్కటే. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మొత్తం బీజేపీకి అమ్ముడు పోయారు. మా పని అయిపోయింది.. కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని కుమ్మక్కయ్యారు. నిజంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు దమ్ముంటే అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లు సాధించుకోవాలి. తమ అభ్యర్థికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలి. ప్రచారంలో సైలెంట్‌గా ఉండి.. బీజేపీకి ఓట్లు వేయించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రశ్న : మీరు గెలిస్తే ఎలా అభివృద్ధి చేస్తారు?

వంశీచంద్ : ప్రతీ ఎకరాకు కృష్ణా నీళ్లు తెచ్చేందుకు పీఆర్‌ఎల్‌ఐ, మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాలను రెండేళ్లలో పూర్తి చేయిస్తా. కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్‌ను ఏడాలో పట్టాలెక్కిస్తా. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్.. ఐటీ హబ్‌గా, షాద్‌నగర్‌ను లాజిస్టికల్ హబ్‌గా, జడ్చర్లను ఇండస్ట్రియల్ హబ్‌గా, దేవరకద్రను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా, నారాయణపేటను టెక్స్‌టైల్ హబ్‌గా, మక్తల్‌ను టూరిజం హబ్‌గా మారుస్తాను. జూరాల, సంగంబండ, కోయిల్‌సాగర్, చంద్రఘడ్ పోర్టును అభివృద్ధి చేసి.. పర్యాటక ప్రాంతంగా మారుస్తా. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. కేంద్రీయ విశ్వవిద్యాలయం, సైనిక్ స్కూల్ తెస్తా. ఎస్సీ వర్గీకరణకు ఢిల్లీలో ప్రతినిధిగా ఉంటా. ముదిరాజులను బీసీ- ఏలోకి మారుస్తా. మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ వచ్చేందుకు కృషి చేస్తా. షాద్‌నగర్ వరకు ఎంఎంటీఎస్ తెప్పిస్తా. జడ్చర్లకు ఔటర్ లేదా బైపాస్ మంజూరు చేయిస్తా. అన్ని సమస్యలు పరిష్కరించి, పాలమూరు గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తా.

అధినేతల రాక

- నేడు కొత్తకోటలో సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్
- రేపు ఏఐసీసీ అగ్రనేత రాహుల్.. 10న ప్రధాని మోదీ..



జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలో రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు; చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ సరిత

మహబూబ్‌నగర్/కొత్తకోట/ఎర్రవల్లి/నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల తేదీ దగ్గర పడుతున్నా కొద్ది ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల అగ్ర నేతల పర్యటనలు పెరుగుతున్నాయి. ఈ నెల ఐదున ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలో నిర్వహించనున్న సభలో పాల్గొననుండగా, ప్రధాని మోదీ ఈ నెల 10న నారాయణపేటకు రానున్నారు. నేడు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తకోటలో నిర్వహించనున్న కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఇప్పటికే పలుమార్లు మహబూబ్‌నగర్ జిల్లాలో సభలు నిర్వహించిన సీఎం ఎనిమిదో సారి జిల్లాకు వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత కొడంగల్‌కు రెండు పర్యాయాలు, కోస్గి, మద్దూర్‌లో ఒక్కో సారి సభలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ సభలోనూ పాల్గొనగా, ఆ తరువాత అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. నారాయణపేటలో బహిరంగ సభ తర్వాత ఇదే పార్లమెంట్ పరిధిలోని కొత్తకోటలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో మాట్లాడనున్నారు. దీంతో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించేందుకు శ్రేణులను ఏర్పాట్లు చేస్తున్నాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమీపంలోని నియోజకవర్గాలైన వనపర్తి, కొల్లాపూర్‌ల నుంచి కూడా ప్రజలు, కార్యకర్తలను తరలించనున్నారు. సీఎం జిల్లా, సొంత నియోజకవర్గం ఇదే పార్లమెంట్‌లో ఉండటంతో ఇక్కడ కాంగ్రెస్ గెలుపును ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. భారీ మెజారిటీతో మహబూబ్‌నగర్‌తోపాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిల మధ్య బిగ్‌ఫైట్ నడుస్తోంది. ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. దీంతో పార్లమెంట్‌పైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో మే ఐదున నిర్వహించనున్న ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభకు రాహుల్‌గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు కాలం చెల్లిందన్నారు. ఎస్పీ రితిరాజ్ సభా స్థలాన్ని పరిశీలించారు.

నారాయణపేటలో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 10న నారాయణపేటకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభా స్థలాన్ని కర్ణాటక కోలార్ ఎంపీ మునిస్వామి నాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, డోకూర్ పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. నారాయణపేటలోని క్రీడా మైదానంలో సభను నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై వారు చర్చించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రఘువీర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

చెన్నంపల్లిలో హత్య

- వ్యక్తిని గొడ్డలితో నరికిచంపిన దుండగుడు



మల్లాజీ(ఫైల్)

లింగాల, మే 3: మామిడి కాయల గొడవ ఓ వ్యక్తి ప్రాణం తీసింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం చెన్నంపల్లి గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నంపల్లికి చెందిన అతికారి మల్లాజీ(40) అన్న శ్రీనివాస్‌కు చెన్నంపల్లి, ఎర్రపెంట మధ్యలో మామిడి తోట ఉంది. దానిని కొల్లాపూర్‌కు చెందిన వ్యక్తికి లీజుకిచ్చాడు. శ్రీనివాస్ అచ్చంపేటలో ఉంటుండటంతో మల్లాజీ తోటను చూసుకునేవాడు. కాగా తోటకు కొద్ది దూరంలో చెన్నంపల్లికి చెందిన లక్ష్మీశంకర్ చిన్నపాటి గుడారం వేసుకొని మేకలను ఉంచుతున్నాడు. అయితే లక్ష్మీశంకర్ తరచుగా మామిడి తోటలో కాయలను తెంపడం మల్లాజీ గమనించాడు. ఈ విషయమై వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం మల్లాజీ ద్విచక్ర వాహనంపై లీజుకు తీసుకున్న వ్యక్తిని తోట దగ్గర వదిలి, తిరిగి వస్తున్నాడు. ఈ సమయంలో మల్లాజీకి, లక్ష్మీశంకర్‌కు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం మల్లాజీ ఇంటికి వెళ్తుండగా లక్ష్మీశంకర్ చేతిలో ఉన్న గొడ్డలితో వెనుక నుంచి తలపై బలంగా నరకడంతో మల్లాజీ అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి చనిపోయాడు. మల్లాజీ భార్య మమత కుటుంబ కలహాల కారణంగా కొన్ని నెలలుగా తల్లిగారి ఊరు తెలకపల్లి మండలం రాయిపాకులలో ఉంటోంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనా స్థలాన్ని అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ జగన్‌మోహన్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భగభగ

- మండుతున్న సూర్యుడు
- వంగూరు మండలం కిష్టంపల్లిలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత



శుక్రవారం మధ్యాహ్నం ఎండకు వాహనాలు లేక వెలవెలబోతున్న జడ్చర్లలోని నేషనల్ హైవే

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్/నారాయణపేట, మే 3: ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఎండలో కొద్దిసేపు ఉంటే చెమటలతో ఒళ్ళు తడిచిపోతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలమూరు జిల్లాలో రికార్డ్ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇళ్లనుంచి బయటకు వెళితే మాడు పగులుతోంది. రహదారులపై సగానికి వాహనాల రద్దీ తగ్గిపోయింది. మధ్యాహ్నం సమయంలో రోడ్లపై కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. ఎన్ని నీళ్ళు తాగినా గొంతెండిపోతోంది. ప్రత్యామ్నాయాలు ఎన్ని వాడినా అవి తాత్కాలిక ఉపశమనమే కావడంతో ఎండలకు తాళలేక జనం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారిపై బీటీ కూడా ఎండలకు సెగలు కక్కుతోంది. వాహనదారులను పైన ఎండవేడిమి, కింద తారురోడ్డు సెగ, వడగాలులు ఉక్కిరి బిక్కిరిచేస్తున్నాయి. ఎంతో మంది వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురవుతున్నారు.

- నాగర్‌కర్నూలు జిల్లాలో శుక్రవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వంగూరు మండలం కిష్టంపల్లిలో అత్యధికంగా 46.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 45.3, కోడేరులో 45.2, పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదై రెడ్ జోన్‌లోకి వెళ్లాయి. ఇక బిజినేపల్లిలో 44.6, వెల్దండలో 44.4, ఉప్పునుంతలలో 44.3, పెద్దకొత్తపల్లిలో 44.3, నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో 44.3, కొల్లాపూర్‌లో 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 45.7, అలంపూర్‌లో 45.2, ధరూర్ 44.6, గద్వాలలో 44.3, కేటీదొడ్డిలో 44, అయిజలో 44, ఇటిక్యాలలో 43.8, ఉండవెల్లిలో 43.7, గట్టులో 42.9, మానవపాడులో 42.9, రాజోలిలో 42.6, మల్దకల్‌లో 42 డిగ్రీలు నమోదు అయ్యింది.
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో జనం అల్లాడిపోతున్నారు. సీసీకుంట మండలంలో 45.5, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లో 45 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ రూరల్, కోయిల్‌కొండ, కౌకుంట్లలో 44.2, దేవరకద్రలో 44.1, నవాబ్‌పేటలో 44, మహబూబ్‌నగర్, అడ్డాకులలో 43.8, మూసాపేటలో 43.5 డిగ్రీలు నమోదైంది.
- వనపర్తి జిల్లా మదనాపూర్, గోపాల్‌పేటలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీరంగాపూర్, పెద్దమందడి, పాన్‌గల్‌లో 44.5, చిన్నంబావి 44.3, ఘనపూర్ 44.1, పెబ్బేరు 43.6, అమరచింత 43.5, వనపర్తి 43.2, రేవల్లి, వీపనగండ్ల 43.1, ఆత్మకూరు, కొత్తకోట 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- నారాయణపేట జిల్లా మక్తల్, నర్వలో 43 డిగ్రీలు, కోస్గి, కృష్ణలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాడ్పులు వీచి ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

బర్రెలకు స్నానం

ఉండవల్లి: అధిక ఉష్ణోగ్రతలకు మనుషులే కాదు మూగ జీవాలూ ఇబ్బందులు పడుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బైరాపురం గ్రామంలో రైతు రాంబాబు తన బర్రెలు ఎండకు ఇబ్బంది పడటాన్ని చూసి నీటితో తడిపాడు. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.



బైరాపురంలో బర్రెలను నీటితో తడుపుతున్న రైతు

ఎండలపై అప్రమత్తం

- జనం వడదెబ్బ బారిన పడకుండా వైద్యఆరోగ్యశాఖ చర్యలు

మహబూబ్‌నగర్(వైద్య విభాగం): పాలమూరు వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భానుడు నిప్పుల కొలిమిలా మారాడు. 42 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం వడదెబ్బ బారిన పడకుండా ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతీ పీహెచ్‌సీలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలని, డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

అవగాహన: ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను జనావాసాలు, గ్రామ పంచాయతీలు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో అతికించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో జరిగే మహిళా సంఘాల సమావేశాలకు హాజరై.. వడదెబ్బ వలన కలిగే పరిణామాల గురించి తెలియజేస్తున్నారని, సామాజిక మాధ్యమాలలో ఆడియో క్లిప్‌ల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధి హామీ కూలీల కోసం మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్ దగ్గర కూడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.

పీహెచ్‌సీలకు చేరిన ఐవీ ఫ్లూయిడ్స్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో గల అన్ని పీహెచ్‌సీలకు ఐవీ ఫ్లూయిడ్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, పారాసిటమాల్ మాత్రలు చేరాయి. అందులో ఇప్పటి వరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు 1.5 లక్షలు ఉన్నాయి. ఆర్‌ఎల్ ఫ్లూయిడ్స్ 10 వేలు, ఎన్ఎస్ ఫ్లూయిడ్స్ ఐదు వేలు, పారాసిటమాల్ మాత్రలు ఐదు లక్షలు పంపించారు. ప్రస్తుతం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఆర్‌ఎల్ 10 వేలు, ఎన్ఎస్ ఐదు వేలు, పారాసిటమాల్ మాత్రలు ఐదు లక్షలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు లక్ష నిల్వ ఉన్నాయి. మరిన్ని అవసరమైతే హైదరాబాద్ నుంచి తెప్పించుకునేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు అనుమతి కూడా ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే దేశ పురోగతి

- నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి - గద్వాల పట్టణంలో విస్తృత ప్రచారం

గద్వాల టౌన్/వడ్డేపల్లి, మే 3 : అన్ని వర్గాల వారిని ఐక్యంగా ఉంచుతూ, దేశ పురోగతి సాధించే శక్తి కాంగ్రెస్‌కే సాధ్యమని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. గడచిన ఏడు దశాబ్దాల్లో దేశంలో ప్రణాళికాబద్ధంగా సాగిన ప్రగతే ఇందుకు నిదర్శనమన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ పదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి గురించి చెప్పుకునేందుకు ఏమీ లేకనే ప్రధాని నరేంద్ర మోదీ మొదలుకుని, స్థానిక బీజేపీ నాయకుల వరకు మతం, దేవుళ్ల పేరుతో ప్రజల మద్దతు కూడగట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు తిరస్కరించాలన్నారు.

అనంతరం స్థానిక నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన మల్లు రవి, నాయకులందరూ సైన్యంగా మారి రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చేసేందుకు నిబద్ధతతో కృషి చేయాలన్నారు. పార్టీ కేంద్ర నాయకత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, గట్టు తిమ్మప్ప, కృష్ణమూర్తి, సత్యనారాయణ, మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, కలీం పాల్గొన్నారు.

శాంతినగర్‌లో రోడ్ షో..

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి వడ్డేపల్లి మండల కేంద్రమైన శాంతినగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేశామన్నారు. తుమ్మిళ్ల ఎత్తి పోతల పథకానికి అనుసంధానంగా ఉన్న మూడు రిజర్వాయర్లను కూడా పూర్తి చేస్తామన్నారు. మతం ముగుసులో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. రాష్ట్రాన్ని అన్నిరకాలుగా దోచుకున్న బీఆర్‌ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ఏదో తప్పుచేశాననే ఉద్దేశంతో తనను ఓటర్లు ఓడించారని, ఆ తప్పును సరిదిద్దుకుంటానన్నారు. ఓడిపోయినా ప్రజల గుండెల్లో ఇప్పటికీ ఉన్నానని, జీవించి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కేసీఆర్ వద్ద కోట్ల రూపాయలు తీసుకుని ఆయనకు తొత్తుగా మారారని ఆరోపించారు.

40 సంవత్సరాలు రాజకీయ అనుభవం ఉన్న మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంకల నాగేశ్వర రెడ్డి, ప్రసన్న కుమార్, నాగశిరోమణి, రామకృష్ణారెడ్డి, రవి, కుమార్, దీపక్, రామిరెడ్డి పాల్గొన్నారు.



శాంతినగర్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మల్లు రవి

డీసీఎంను ఢీ కొట్టిన కారు

- వ్యక్తి మృతి - మరొకరికి గాయాలు

మద్దూర్, మే 3 : కారు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం దోరేపల్లి శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్సై రాంలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గికి చెందిన తునికి వెంకట్రాములు (58) , వల్లపల్లి రాములు ఇద్దరు షిఫ్ట్ కారులో నారాయణపేట నుంచి కోస్గి వెళ్తున్నారు. ఈ క్రమంలో మద్దూర్ మండలంలోని దోరేపల్లి శివారులో ఎదరుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న తునికి వెంకట్రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. వల్లపల్లి రాములుకు గాయాలయ్యాయి. స్థానికులు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



క్షతగాత్రుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్న గ్రామస్థులు

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి రెండు రోజుల జైలు

చారకొండ, మే 3: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి కావ్య రెండు రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వారం రోజుల క్రితం ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టారు. దేవరకొండ మండలం పడ మటిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. శుక్రవారం అతడిని కోర్టు కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ కల్వకుర్తి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు ఫోన్లు అందజేత

చారకొండ, మే 3: మండలంలోని వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజశేఖర్ అందజేశారు. ఫోన్లను చాకచక్యంగా వ్యవహరించి దొరికించుకుని తిరిగి బాధితులకు అప్పగించిన సైబర్ వారియర్ ఆంజనేయులును వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ అభినందించారు. హెడ్‌కానిస్టేబులు శ్రీనివాసులు, కానిస్టేబుల్ హరిలాల్, మల్లేష్ ఉన్నారు.



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్ఐ రాజశేఖర్

ఆదర్శంగా మండల మహిళా సమాఖ్య

- స్త్రీనిధి రుణాలతో ఉపాధి
- కిరాణం, విస్తరాకుల తయారీ, కారం, పిండి గిర్నీల నిర్వహణ
- కుటీర పరిశ్రమలతో రాణిస్తున్న మహిళలు

అమరచింత, మే 3: గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలతో ఆర్థికంగా రాణిస్తున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సంస్థ, జీవనోపాదుల ఉపాధి కల్పన తదితర రంగాల్లో రుణాలు పొంది తాము అబలలు కాదు సబలలం అని నిరూపించుకుంటున్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలంలో స్వయం సహాయక మహిళా సంఘాలు 15 ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో పొదుపు సంఘాలు 337 ఉండగా అందులో 3,992 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామాల సంఘాల మహిళలకు అనునిత్యం మండల సమైక్య ఏపీఎం, సీసీలు ఉపాధి కల్పన, రుణాలు తీసుకోవడం, రికవరీ తదితర అంశాలపై అమరచింత మండలం మహిళా సమైక్యలో అవగాహన కల్పిస్తుంటారు.

129 మహిళా సంఘాల సభ్యులకు 2023-24 సంవత్సరానికి బ్యాంకుల ద్వారా మొత్తం రూ.14,42,60,000ల రుణాలు ఇచ్చారు. స్త్రీ నిధి ద్వారా 16 చిన్న సంఘాలకు రూ.46,74,643లు అందజేశారు. అలాగే ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార విధాన సంస్థ ద్వారా మహిళా స్వయం సహాయక సభ్యులకు రూ.13,30,000 మంజూరు చేయించారు. అంతేగాక వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మహిళా సంఘాలకు కమీషన్ రూపంలో చేయూతనిస్తు వచ్చింది.

రాణిస్తున్న మహిళలు ....

మహిళా స్వయం సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు కుటీర పరిశ్రమలు పెట్టుకుని పురుషులతో సమానంగా ఆర్థికంగా రాణిస్తున్నారు. మండలంలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన అంజమ్మ సమైక్య ద్వారా లక్ష రూపాయలు రుణం తీసుకుని పిండి గిర్ని నడుపుతూ ఉపాధి పొందుతోంది. అలాగే చంద్రఘడ్ గ్రామానికి చెందిన పుష్ప లక్ష రూపాయల రుణం తీసుకుని ఇస్తరాకుల మిషన్ పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా కిష్టంపల్లి గ్రామానికి చెందిన రామేశ్వరమ్మ రూ.40వేల రుణం తీసుకొని కారం పొడి గిర్నిని పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. ఇలా మహిళలు కుటీర పరిశ్రమలు నడుపుతూ కుటుంబ పోషణలో తమ వంతుగా సహకారం అందిస్తున్నారు.



చంద్రఘడ్ గ్రామంలో రుణం పొంది విస్తరాకుల మిషన్ పెట్టుకున్న పుష్ప

పిండి గిర్ని నడుపుతున్నా...



మహిళా సంఘం నుంచి బ్యాంకు ద్వారా లక్ష రూపాయలు రుణం తీసుకొని మా ఊర్లోనే పిండి గిర్ని నడుపుతున్నా. పిండి గిర్ని ద్వారా వచ్చే ఆదాయంతో తీసుకున్న అప్పుకు కిస్తులు కడుతూనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

- అంజమ్మ, ఈర్లదిన్నె గ్రామం, అమరచింత మండలం

రుణాలపై అవగాహన కల్పిస్తున్నారు



మహిళా సమాఖ్య ద్వారా పొదుపు చేయడమే కాకుండా వివిధ రకాల రుణాలు, వాటి వల్ల లాభాలు తదితర వాటి గురించి అమరచింత మండల మహిళా సమాఖ్య అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తీసుకున్న రుణాలతో ఉపాధి పొంది సకాలంలో చెల్లిస్తున్నాం.

- పుష్ప చంద్రఘడ్ గ్రామం, అమరచింత మండలం

మహిళలు కుటీర పరిశ్రమల్లో రాణిస్తున్నారు



స్త్రీనిధి తదితర రుణాలతో మహిళలు కుటీర పరిశ్రమల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ సమాఖ్య ద్వారా కల్పిస్తున్న పథకాలు మహిళలు వినియోగించుకుంటున్నారు. రుణాలు తీసుకుంటున్న మహిళలు ఉపాధి పొంది సకాలంలో బ్యాంకులకు కిస్తులు చెల్లిస్తున్నారు.

- శ్రీనివాసులు, ఏపీఎం

మహిళ ఆత్మహత్య

గోపాల్‌పేట, మే3: జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన ఈశ్వరమ్మ షుగర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతోడై జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి తలకు వేసుకునే కలర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. బాధితురాలి కొడుకు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం

మక్తల్, మే 3 : టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 80గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. కాచ్‌వార్‌లోని మహాలక్ష్మీదాబా సమీపంలో వంట పని చేసే అనిల్ పాండె అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయన నుంచి 80గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

రాజోలి, మే 3 : గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని ముండ్లదిన్నె గ్రామంలో పేకాట రాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో వాగులోకి వెళ్లే దారిలో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. తొమ్మిదిమంది పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ. 8,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి

- రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను సన్మానిసున్న డీఎంహెచ్‌వో

బిజినేపల్లి, మే 3 : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సేవల్లో భాగంగా అమలు చేస్తున్న వివిధ పథకాల ఫలాలను అర్హులకు సకాలంలో అందించాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసీ పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయూష్ ద్వారా అందుతున్న వైద్య సేవలను రికార్డుల్లోని రోగుల వివరాలను పరిశీలించారు. టీహబ్ ద్వారా రోగులకు అందుతున్న వివిధ రక్త పరీక్షలు, ఇతర పరీక్షల వివరాలను అడిగి తెలుసుకొని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. జిల్లాలో వందశాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలు సాగించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులను వైద్య సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయనను డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ లాల్ సన్మానించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, జిల్లా టీకాల అధికారి రవినాయక్, డాక్టర్ శివకుమార్ తదితరులున్నారు.

ఉపాధిహామీ పనులు పకడ్బందీగా చేపట్టాలి

- పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్



కుప్పగండ్లలో ఉపాధిపనులను పరిశీలిస్తున్న రవీందర్

వెల్దండ, మే 3 : గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ పీ రవీందర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో ఉపాధిహామీ పనులను రవీందర్ పరిశీలించారు. అలాగే గ్రామంలోని నర్సరీలు, ఉపాధిహామీ వసతులు, ట్యాంక్‌బండ్ నిర్వహణ తదితర పనులను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు 250 రూపాయలు కూలీ గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని సూచించారు. నర్సరీలలోని మొక్కలను కాపాడాలని, వాటికి నీటివసతి, నిర్వహణ పట్ల అలసత్వం తగదని అన్నారు. ఏవైనా గింజలు మొలకెత్తకపోతే తిరిగి పెట్టాలని పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలీలకు నీటి వసతి, టెంట్లు వంటి వసతులు కల్పించాలని రవీందర్ తెలిపారు. ఎస్‌పీఎం కృష్ణమూర్తి, డీఆర్‌డీవో చిన్న ఓబులేషు, సీఈవో దేవసాయిబు, డీపీవో కృష్ణ, ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఏపీవో ఈశ్వర్‌జీ, ఎంపీవో సునిత, ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సుబాబుల్ తోట దగ్ధం

- రూ. ఎనిమిది లక్షల ఆస్తి నష్టం



బుడమొర్సులో దగ్ధమవుతున్న సుబాబుల్ తోట

వడ్డేపల్లి, మే 3 : గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమొర్సు గ్రామంలో శుక్రవారం సుబాబుల్ తోట దగ్ధమైంది. బాధిత రైతులు గోవిందు, గిడ్డన్న, రంగన్న వివరాల ప్రకారం.. ఎనిమిది ఎరాల్లో సుబాబుల్ తోటను సాగు చేశారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి తోట మొత్తం దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఎనిమిది లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. చేతికి అందిన సుబాబుల్ తోట దగ్ధమైందని ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి తమకు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు కోరారు.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

అయిజ, మే 3: గద్వాల జిల్లా అయిజ మునిసిపాలిటీ పరిధిలోని పర్థిపూర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన కురువ గంగన్న పశువుల కోసం పశుగ్రాసం నిల్వ చేసుకున్నాడు. గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 1.50లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

● **వెల్దండ :** మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బాల్‌రాం అనే రైతుకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ. 20వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

కోస్గి ఆర్టీసీ కాంప్లెక్స్ తనిఖీ



కాంప్లెక్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కోస్గిరూరల్, మే 3: కోస్గి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆర్టీసీ నారాయణపేట స్టాల్స్ విజిలెన్స్ బృందం సభ్యుడు సల్మాన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ముందు తోపుడు బండ్లు ఉంచిన వారికి జరిమాన విధించారు. కాగా, గత రెండు సంవత్సరాలుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణానికి కిరాయి ఇవ్వకుండా పక్కదుకాణం వ్యక్తి వాడుకుంటున్నాడని పలువురు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

రాజ్యాంగ హద్దులు దాటిన మోదీ మాటలు

- బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే ఒకే కుండలోకే..
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచకుళ్ల

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 3: దేశంలో బీజేపీ మళ్లీ గెలిస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రధాని మోదీ రాజ్యాంగ హద్దులు దాటి మాట్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. వైఎస్ హయాంలో ఏర్పాటు చేసిన కమిషన్ ద్వారా చట్టబద్ధంగా రూపొందించిన ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని మాట్లాడడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మల్లు రవి గెలుపు కోసం నిర్వహించిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథులు గా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మతతత్వ బీజేపీని నిలువరించడానికి ఇండియా కూట మిలో భాగంగా తెలంగాణలో సీపీఐ కాంగ్రెస్‌కు మద్దతునిస్తోందన్నారు. దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు రోజు రోజు పెరుగుతు న్నాయని, ఉత్తరాదిలో బీజేపీ 50 శాతం సీట్లును కోల్పోవడం ఖాయమన్నారు. మోదీకి వ్యతిరేకంగా మాట్లాడే వారందరిని భయపెట్టేందుకే బీజేపీ కేంద్ర దర్యాప్తు, పోలీసు సంస్థలను వినియోగించుకుంటుందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికత్వానికి విఘాతం కలిగేలా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న మోదీ, అమిత్‌షాలను వదిలేసి వీడియో మార్ఫింగ్ అంటూ రేవంత్‌రెడ్డిని భయ భ్రాంతులకు గురి చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోం దన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, వాటిలో దేనికి ఓటేసినా అవి ఒకే కుండలో కలుస్తాయన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దెదించిన ప్రజలు ఈ పార్లమెంటు ఎన్నికల్లో మతో న్మాద బీజేపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హెచ్. ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, ఎండీ.ఫయాజ్, నాయకులు జంగయ్య, ఆంజనేయులు విజయరాములు, పర్వతాలు, కళావతమ్మ, యేసయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



బిజినేపల్లిలో టీపీజేఏసీ కరపత్రం విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

బిజినేపల్లి, మే 3 : దేశంలో, రాష్ట్రంలో దీర్ఘకాలిక ప్రభుత్వాలు కొనసాగితే ప్రజాస్వామ్య స్ఫూర్తిగా గొడ్డలి పెట్టుగా మారుతాయని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో టీపీజేఏసీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చే ప్రభుత్వాలు ఎన్నికోబడాలంటే ప్రతీసారి ప్రభుత్వాలను మార్చితేనే రాజకీయ నాయకుల్లో మార్పు వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తారన్నారు. దేశంలో బీజేపీ మత, కుల విద్వేషాలను ప్రోత్సహించి ప్రజల మధ్య అనైక్యత భావాన్ని పెంపొందించి ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుందని విమర్శించారు. రాజ్యాంగ మౌలిక లక్షణాలైన లౌకిక, సామ్యవాదం, సమానత్వంను విస్మరించి ఫాసిస్ట్ పాలనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సాగిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, వివిధ వర్గాల ప్రజల ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేసి కేవలం ఐదు కుటుంబాల కార్పొరేటు సంస్థలకు లక్షల కోట్ల రూపాయాలు దోచి పెట్టాడని దుయ్యబట్టారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గద్దె దించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించే నూతన ప్రభుత్వాని ఎన్నుకునేందుకు తమ విలువైన ఓటు వినియోగించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తర భారత దేశ పెత్తనం, వలసలు ఎక్కువగా ప్రోత్సహించి దక్షిణ భారత దేశ ప్రజల ఉపాధి అవకాశాలను దెబ్బతీసి ఉనికి లేకుండా చేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వంగా వెలుగుతున్న దేశంలో శాంతియుత వాతావరణం, ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఇంటికి సాగనంపాలని కోరారు. సమావేశంలో టీపీజేఏసీ నాయకులు ముత్తయ్య, రామగిరి ప్రకాశ్, విజేందర్, శ్రీదేవి, ఖలీల్, యాదయ్య, సత్యనారాయణ గట్టన్న తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఉప్పునుంతల, మే 3: ఇంటికి తాళం పగులగొట్టి బంగారం, వెండి, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూరం నరేష్ గురువారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి మిద్దెపై నిద్రించాడు. శుక్రవారం తెల్లవారుజామున నరేష్ భార్య బూరం అనూష్ నిద్ర లేచి కిందికి దిగి రాగా ఇంటి తలుపు పగలకొట్టి ఉన్నాయి. అది చూసిన ఆమె విషయాన్ని భర్తకు తెలిపింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి కడియాలతో పాటు కొంత నగదును చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత



గద్వాల: పట్టుకున్న నగదుతో జిల్లా పోలీసులు

నారాయణపేటరూరల్/తిమ్మాజిపేట/గద్వాలక్రైం/రాజాపూర్, మే3: లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేస్తూ అధిక మొత్తం నగదుతో వెళ్తున్న వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

● నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో రమేశ్ అనే వ్యక్తి పేట నుంచి ఊట్కూర్ వెళ్తుండగా వాహనాల తనిఖీలో రూ. 4,22000, జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర యాద్గీర్ జిల్లా నుంచి వస్తున్న వసీం అక్రం వద్ద రూ.లక్ష, గుర్మిట్‌కాల్ నుంచి వస్తున్న భీంషప్ప దగ్గర రూ.93,850 నగదను స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండ శివారులో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 1.88లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తన వాహనంలో రూ. 1.88లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

గద్వాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 4,21,000 నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు గద్వాల ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 2,49,000, బల్గెర చెక్‌పోస్టు వద్ద రూ. 92,000, రాజోలి మండల కేంద్రం వద్ద రూ. 80,000, మొత్తం రూ. 4,21,000 ఎలాంటి రశీదు లేని వాటిగా గుర్తించి సీజ్ చేశామన్నారు. సంబంధిత నగదును గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డిగూడ శివారులోని జాతీయ రహదారి 44పై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర వాహన తనిఖీల్లో రూ. 1.27లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆత్మకూర్‌కు బొలెరో వాహనంలో వెళ్తున్న హరికుమార్, తిరుపతయ్య దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఫ్యూచర్ ఛాంప్స్..ఫుల్ జోష్

- క్రీడా శాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు
- క్రీడాకారుల ప్రాక్టీస్‌తో మైదానాలు కళకళ



వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 3: వేసవి శిక్షణ శిబిరాలతో మైదానాలు, అకాడమీలు, ఇండోర్ స్టేడియం కళకళలాడుతున్నాయి. క్రీడాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు మొదలు కావటంతో ఏ మైదానం చూసినా ప్రాక్టీస్ చేసే చిన్నారులతో ఉదయం, సాయంత్రం సందడిగా ఉంటోంది. నెలాఖరు వరకు కొనసాగే ఈ క్యాంపుల్లో ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇస్తూ మెలకువలు నేర్పుతుండడంతో 'ఫ్యూచర్ ఛాంప్స్'లో జోష్ కనిపిస్తుంది.

విద్యార్థుల్లో జోష్....

వేసవి క్రీడా శిబిరాలు అనగానే పిల్లలకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఇప్పటివరకు వారిలో ఉన్న నిరాశ నిస్పృహలన్నీ తొలగిపోతాయాయి. గ్రామీణ, అర్బన్ ప్రాంతల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా క్రీడా మైదానాలు సందడిగా మారాయి. ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఎండ తీవ్రత లేని సమయాల్లో శిక్షణ ఇస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, చెస్ క్రీడ అంశాల్లో శిక్షణ అందజేస్తున్నారు. వేసవి శిబిరాల్లో ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చి, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికైయ్యారు.



అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు



వేసవి శిబిరాల్లో ఎంతో మంది ప్రతిభ క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. 13 ఏళ్లుగా అథ్లెటిక్స్ కోచ్‌గా స్టేడియంలో వేసవి శిక్షణ ఇస్తున్నాను. ఎంతో మంది క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. క్రీడ కోటలో ఉద్యోగాలు సాధించారు. వేసవి శిక్షణలో చిన్నారులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ప్రతిభ ఆధారంగా ఎంపికవుతారు.

-సునీల్‌కుమార్, అథ్లెటిక్ కోచ్, స్టేడియం

టెక్స్ టైల్స్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ టౌన్, మే 3: ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజి నందు (53) సీట్లుకు, తమిళనాడులోని సేలం నందు (12) సీట్లు, కర్ణాటకలోని గడగీ నందు (04) సీట్లు, (3) సంవత్సరాల హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్ టైల్ టెక్నాలజి డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు అర్హులైన తెలంగాణ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు డి. బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోర్సుకు అభ్యర్థులు పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండి 1-7-2024 నాటికి బీసీ జనరల్ కేటగిరి వారు 15 నుంచి 23 సంవత్సరాలలోపు వయస్సు, ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారు 15 నుండి 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. 1-6-2024 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు, దరఖాస్తు పొందుటకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కారు బోల్తా పడి మహిళ మృతి

దేవరకద్ర, మే 3: అదుపు తప్పి కారు బోల్తా పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని డోకూరు స్టేజీ కస్తూర్బా పాఠశాల సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి సొంత గ్రామమైన పుట్టపల్లికి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న సువర్ణ (28) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన మహిళను జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగాల, మే 3: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రం సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. లింగాల నుంచి అచ్చంపేట వైపు వెళ్తున్న ఓపెన్‌టాప్ జీపు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ రాజుకు ఎడమ కాలు విరిగింది. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను ఆస్పత్రికి తరలించారు.

మద్యం స్వాధీనం

అలంపూర్‌చౌరస్తా, మే 3: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామ శివారులో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. పుల్లూరు గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి టోల్‌ప్లాజా వద్ద ఉన్న వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తుండగా సరిహద్దులో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అతడి వద్ద 18 లీటర్ల మద్యం విలువ రూ. 21,800 ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని ఆయుదం బండ తండా గ్రామంలో గురువారం రాత్రి నాలుగు బీరు కాటన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఆయుదం బండతండా గ్రామానికి చెందిన కేతావత్ కిషన్ ఇంటిదగ్గర సుమారు రూ. 7680 విలువగల మద్యంను విక్రయించడానికి నిల్వ ఉంచుకోగా పోలీసులు దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నారాయణపేట, మే3: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ట్రాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట సుభాష్ రోడ్‌లోని నర్సింహులు, అనంతయ్యలకు చెందిన ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం వచ్చింది. దాంతో ట్రాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 4.08 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. డీటీ పంచనామా నిర్వహించారు. నర్సింహులు, అనంతయ్యలపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిబిరాలు చాలా ముఖ్యం



మాది యెన్మన్‌గండ్ల రోజు స్టేడియంలో వాలీబాల్ శిక్షణ పొందుతున్నా. వేసవి క్రీడా శిబిరాలు చాలా ముఖ్యమైనవి. శిబిరంలో కోచ్‌లు మంచి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. వేసవి శిక్షణలో నా ప్రతిభ చాటాను. గతేడాది జాతీయస్థాయి లో టోర్నీలో రాష్ట్ర అండర్-14 బాలుర జట్టుకు ఎంపికైయ్యాను.

-ఖాజాజైనుద్దీన్, వాలీబాల్ ఆటగాడు

జాతీయ స్థాయికి ఎదిగారు



ప్రతీ ఏడాది క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ వేసవి శిబిరాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైయ్యారు. టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. ప్రతీ క్రీడాకారుడిపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇచ్చి, మేళకువలు నేర్పిస్తాం. ఎంతో ఉత్సాహంగా చిన్నారులు, యువత శిక్షణ శిబిరాల్లో పాల్గొంటారు.

-పర్వేజ్, వాలీబాల్ కోచ్, స్టేడియం

శిక్షణ చాలా బాగుంది



స్టేడియం మైదానంలో వేసవి శిబిరంలో అథ్లెటిక్స్ శిక్షణ చాలా బాగా ఇస్తున్నారు.కోచ్ రోజూ ఉదయం, సాయంత్రం శిక్షణతో పాటు అథ్లెటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. అథ్లెటిక్స్‌లో రాణించి జిల్లా జట్టుకు ఎంపిక అవుతాను

-బృందయాదవ్, విద్యార్థి

మాదక ద్రవ్యాల వాడకం నిషేధంపై పోస్టర్లు విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వాడకం నిషేధంపై శుక్రవారం పోస్టర్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ విడుదల చేశారు. అనంతరం బస్టాండ్‌లో మాదక ద్రవ్యాల నిషేధంపై పోస్టర్ అతికించారు. గంజాయి, కల్తీకల్లును నిర్మూలిద్దాం మన సమాజాన్ని కాపాడుకుందామని బస్టాండ్‌లో ఉన్న ప్రజలనుద్దేశించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, ఎలాంటి చెడు అలవాట్లకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. 14,15 నుంచి 16 సంవత్సరాల పిల్లలు గంజాయిలకు అలవాటు పడుతున్నారని, మా దగ్గరికి చాలా కేసులు వస్తున్నాయని తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి మీ పిల్లలను ఎలాంటి చెడు అలవాట్లకు గురి కాకుండా కాపాడుకోవాలని తెలిపారు. డీసీఆర్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్య డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్, ఎస్‌ఐ గోవర్ధన్‌తోపాటు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, మే 3 : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శివగంగా ఫంక్షన్ హాల్‌లో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ విజయలక్ష్మీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొమ్ము మధు, జడ్పీటీసీ సుమిత్ర, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ యాదయ్య, కాంగ్రెస్ నాయకులు బండ పర్వతాలు, వెంకటయ్యగౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, మణెమ్మ, మండలంలోని కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను రద్దు చేసి రాజ్యాంగాన్ని మార్చే కుట్ర


సమావేశంలో మాట్లాడుతున్న బచ్చలకూర బాలరాజు

కొల్లాపూర్, మే 3 : బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు రద్దు చేసి రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని తెలంగాణ దళిత దండు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు తెలిపారు. మంత్రి జూపల్లి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేసి రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని, ప్రజలు బీజేపీ చెప్పే బూటకపు మాటలు నమ్మవద్దని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రహస్య స్నేహితులని, మతం దేవుడు పేరు పైన విద్వేషాలను రెచ్చగొడుతూ అరాచకాలు చేసే బీజేపీని ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేసి తెలంగాణ రాష్ట్రమిచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు కుడికిళ్ల జంగం రాము, సంపంగి నరసింహ, బోరెల్లి సంగెం, మల్లెల వెంకటస్వామి, మాందాపురం నరసింహ, అంకిరావుపల్లి జిలకర రామకృష్ణ, బోరెల్లి కృష్ణ, జిలకర కృపాకర్, కద్దాల విజయ్, కలమూరి రాముడు, ఎల్లెపువ్వ మధు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం'

వెల్దండ, మే 3 : అన్నివర్గాల అభివృద్ధి, సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని కొట్ర, బుడ్డోనిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవిని గెలిపించాలని కోరుతూ బాలాజీసింగ్, మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిగా మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిరాశోభన్, అధ్యక్షుడు మోతీలాల్, నాయకులు భూపతిరెడ్డి, జయప్రకాష్, సంజీవ్‌కుమార్, శ్రీనుయాదవ్, రవీందర్‌రావు, శంకర్‌నాయక్, గున్నెళ్లశ్రీను, కృష్ణముదిరాజ్, నారాయణ, కాడురాం, గోరటిశ్రీను, పత్యానాయక్, రాణి, గోపాల్, రాములు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

వెల్దండ, మే 3 : నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఉన్నత విద్యావంతుడైన ప్రవీణ్‌కుమార్‌కు ఓటుద్వారా మద్దతు తెలపాలని కోరారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు బీమయ్యగౌడ్, నాయకులు నర్సింహ ముదిరాజ్, శ్రీను, ఖైసయ్య, ఎండీ అలీ, లాలయ్య, యాదయ్య, రాంచంద్రయ్య, కొండల్, రాజు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

'కేంద్రంలో బీజేపీని ఓడించాలి'

పెంట్లవెల్లి, మే 3 : బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు అన్నారు. శుక్రవారం పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, గోప్లాపూర్, కొండూరు, సింగవరం, పెంట్లవెల్లి గ్రామాల సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతతత్వ బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. పదేళ్ల మోదీ పాలన ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని వారన్నారు. ఈ సారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి మతరాజ్యాన్ని స్థాపించాలని చూస్తుందని ఆయన పేర్కొన్నారు. సీపీఎం నాయకులు ఇంటింటికి తిరిగి ఇండియా కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్, మండల నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, తిమ్మస్వామి, శ్రీను, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెబుతున్నారు

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



వృద్ధుడితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి, మే 3 : ఆరు గ్యారెంటీల్లో ఒకటే అమలు చేసి అన్ని చేశామని అబద్ధాలు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి, కామారెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఎన్నికల నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఏజెంట్లతో, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలు, సీ విజిల్ యాప్, సువిధ యాప్ గురించి వివరంగా కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలని, ఈ విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. దీనిలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో హోం ఓటింగ్ ఓటర్లు మొత్తం 546మంది ఉన్నారు.. వీరిలో సీనియర్ సిటిజన్స్ 228 మంది, దివ్యాంగులు 259 ఓటర్లు, అత్యవసర సేవలకు సంబంధించిన ఓటర్లు 59మంది ఉన్నారు... హోం ఓటింగ్ ప్రక్రియను చేపట్టడానికి 33రూట్లను చేసినట్లు 22బృందాల హోం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సాధారణ ఎన్నికలు 2024 నియమావళి ప్రకారం రాజీకయ పార్టీలు, సభలు అనుమతులకు ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను ఎన్నికల నియమాలకు లోబడి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలకు, సమావేశాలకు లాగిన్ అయితే నిబంధనలకు లోబడి వెంటనే అనుమతులు మంజూరు వస్తుందని తెలిపారు. సువిధ యాప్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఎప్పటిప్పుడు పరిశీలిస్తూ నిబంధనలకు లోబడి ఉన్న వాటికి నిర్దీత గడువులోపు అనుమతులు జారీ చేసేలా చొరవ చూపనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్క లావాదేవీలపై తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సువిధ పోర్టల్‌లో నమోదుపై రాజకీయ పార్టీల వారికి అవగాహన కల్పించామని ఎంసీసీ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు.

అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


వెల్దండలో బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఆచారి

వెల్దండ, మే 3 : అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికలో బుద్ధి చెప్పాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండలస్థాయి బూత్‌కమిటీ సభ్యులతో పార్లమెంటు ఎన్నికల్లో చేపట్టాల్సిన విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ పేదల రిజర్వేషన్లు తీసివేస్తారని బీజేపీపై అసత్యపు ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌కు ఎన్నికల్లో భంగపాటు తప్పదన్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీ సర్కార్‌దేనన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నోసార్లు రాజ్యాంగాన్ని సవరణ చేసిందని, రేవంత్‌రెడ్డి తన స్థాయికితగినట్లుగా మాట్లాడాలని హితవుపలికారు. బీఆర్‌ఎస్ ఎస్టీలపై మొసలి కన్నీరు కారుస్తుందని, అసలు ఓటు అడిగే నైతిక హక్కు ఆ పార్టీకి ఎంత మాత్రం లేదన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, రామమందిర నిర్మాణం వంటి ఎన్నో అంశాలను బీజేపీ పరిష్కరించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కేవలం తమ వారసుల కొరకు మాత్రమే తపన పడుతున్నాయని, మోదీకి సరితూగే నాయకులు ఆయా పార్టీలలో ఎంతమాత్రం లేరని ఆచారి పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, ఎంపీటీసీ సభ్యుడు చక్రవర్తిగౌడ్, నాయకులు పరమేష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, బాలస్వామి, రామస్వామి, శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు.

బీసీలంతా ఏకమవ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్


సమావేశంలో మాట్లాడుతున్న కాళ్ల నిరంజన్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 3: జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు బీసీలంతా ఏకమై నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి గెలుపు కోసం కృషి చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల నిరంజన్ మాట్లాడుతూ బీసీ కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచడంతో పాటు బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని విశ్వాసంతో ఈ ఎన్నికల్లో మద్దతునిస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి అన్ని వర్గాలను కలుపుకుని ప్రజా సమస్య లపై నిరంతరం పని చేసే వ్యక్తన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పార్లమెంటు పరిధిలో పర్యటించి కాంగ్రెస్‌కు ఓట్లు వేసేలా బీసీలను చైతన్యం చేస్తామని ఆయన అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు కొట్ర శ్రీనివాసులు, తిరుపతయ్య, సుధాకర్‌గౌడ్, పబ్బతి శ్రీనివాసులు, చెన్నయ్య, కృష్ణయ్య, నిరంజన్, గంగోజీ, నిరంజన్ యాదవ్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో గొంతు వినిపిస్తా

- మాలల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


మాలల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

అమ్రాబాద్, మే 3: బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తున్న తనను ఈ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యునిగా ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే నల్లమల ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అమ్రాబాద్‌లో శుక్రవారం మాలల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ పార్టీలు ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజల ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలని చూస్తున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కేంద్రంలో ఎన్నికయ్యే ప్రభుత్వం యురేనియం సమస్యను మళ్లీ తెరపైకి తీసుకువచ్చే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. తాను ప్రజల తరఫున నిజమైన ప్రతిపక్షంగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను నిలదీస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. తన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావడం మూలంగా చిన్నతనంలో రెండు దశాబ్దాల పాటు అమ్రాబాద్ మండల పరిధిలోని వెంకటేశ్వర బావి, అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామాల్లో నివసించినట్లు ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పదర జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు నాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి, అభిలాష్ రావు జిల్లా, మండల నాయకులు చెన్నకేశవులు, రవీందర్ రెడ్డి, శంకర్, సురేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 3 : తెలంగాణలో ప్రజలను, రైతులను పట్టించుకోని బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతారని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రశ్నించారు. కుర్చీని వేసుకుని కూర్చొని పీఆర్‌ఎల్‌ఐని పూర్తి చేస్తానన్న కేసీఆర్ 26వేల కోట్లు ఖర్చు చేసి చుక్కనీరు ఇవ్వలేదని, పీఆర్‌ఎల్‌ఐకి కేంద్రంలోని బీజేపీ జాతీయ హోదా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశాయని మండిపడ్డారు.

కల్వకుర్తి పట్టణంలోని మాజీ మంత్రి జే.చిత్తరంజన్ దాస్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, పార్లమెంట్ పరిశీలకురాలు ఇందిరా శోభన్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాగర్‌కర్నూల్‌లో ఎంపీ అభ్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇది వరకే ప్రచారం నిర్వహించారని తెలిపారు. ఈ నెల 5న ఎర్రవల్లిలో నిర్వహించే జన జాతర బహిరంగ సభకు రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో పని చేసిన ఎమ్మెల్యే పట్టింపు లేని ధోరణి వల్లనే ఈ ప్రాంతం సాగు, విద్య, వైద్య రంగాల్లో పూర్తిగా వెనకబాటుకు గురైందని విమర్శించారు. కేఎల్ఐ డీ-82పూర్తి చేయలేకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీరందలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కేఎల్ఐ డీ-82లో ఓ రైతుకు పెండింగ్‌లో రూ.5లక్షల 2626రూపాయలను విడుదల చేయించానన్నారు. పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు రైతులకు సాగునీరందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కల్వకుర్తిలో 100పడకల ఆసుపత్రిని, ఆమనగల్‌లో 50పడకల ఆసుపత్రి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకులు ఎన్నం భూపతిరెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, శశికుమార్‌గౌడ్, కౌన్సిలర్లు ఏజాస్, రవీందర్ ఉన్నారు.

కల్వకుర్తిలో రోడ్ షో

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి మద్దతుగా కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. అంతకు ముందు పలువురు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి భార్య డాక్టర్ జాస్పీదేవి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి కుమారుడు సిద్దార్థ, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్‌లో కూలీల సంఖ్య పెంచాలి

కల్వకుర్తి, మే 3 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర స్థాయి ప్రత్యేక అధికారి, పీఆర్ అండ్ ఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ పి.రవీందర్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంపై జిల్లా స్థాయి ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీ, టీఏలతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి రవీందర్ హాజరై మాట్లాడారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీదేవసహాయం, సీఆర్‌డీ అధికారి కృష్ణమూర్తి, డీఆర్‌డీవో చిన్నఓబులేషు, డీపీవో కృష్ణ, డీఎల్‌పీవో శ్యాంసుందర్, కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

దండోరా నాయకుల ప్రచారం

పెద్దకొత్తపల్లి, మే 3 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని తెలంగాణ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతటి గోపి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కల్వకోల్, సాతాపూర్, పెద్దకొత్తపల్లి గ్రామాల్లోని బస్టాండ్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ దండోరా రాష్ట్ర కార్యదర్శి దర్శనాల సాయికుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఏళ్లపాగ జాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమయ్య, గోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

పెద్దకొత్తపల్లి, మే 3 : బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి డాక్టర్ మల్లురవిని గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, మాజీ సర్పంచ్ మశన్న, నాయకులు బండి సాయిబాబు తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 3: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డులో ఎంపీ ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సరిగ్గా నాలుగు నెలలు గడవక ముందే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, బీఆర్‌ఎస్ పాలనలో పేద ప్రజలకు చేసిందేమి లేదని జూపల్లి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జూపల్లి ఓటర్లను అభ్యర్థించారు. మునిసిపల్ కౌన్సిలర్ పిన్నంశెట్టి జ్యోతి, కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే గ్రామాలభివృద్ధి'

ఊర్కొండ, మే 3: కాంగ్రెస్‌తోనే గ్రామాలాభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి అన్నారు. శుక్రవారం మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం వారికి శీతల పానీయాలు అందించారు.

స్టేట్ సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక


తరుణ్

వంగూరు, మే 3: మండలంలోని ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆర్యపల్లి రామచంద్రం, రజితల చిన్న కుమారుడు తరుణ్ స్టేట్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. మార్చి 10న నిర్వహిచిన కామన్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. ఆ తర్వాత మార్చి 22న కరీంనగర్‌లో నిర్వహించిన ఈవెన్స్‌కు హాజరయ్యాడు. రిటర్న్ టెస్టు, ఫిజిక్ టెస్టు పరీక్షలో కూడా ప్రతిభ చాటి స్టేట్ సైనిక్ స్కూల్ కరీంనగర్‌కు ఎంపికయ్యాడు. తరుణ్ కల్వకుర్తిలోని బ్రిలియంట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతూ 6వ తరగతికై పరీక్ష రాశాడు.

ఇప్పుడు స్టేట్ సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడంతో తరుణ్ కరీంనగర్‌లోని రుక్మాపూర్ స్టేట్ సైనిక్ స్కూల్‌లో 6వతరగతి నుంచి ఇంటర్మీయట్ వరకు చదువనున్నాడు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

అచ్చంపేటటౌన్, మే 3: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్ల నర్సయ్య అన్నారు. మండల పరిధిలోని మన్నేవారిపల్లి గ్రామ నాయకుడు రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దశరథ్‌లు సొంత నిధులతో క్రికెట్ కిట్‌లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మన్నేవారిపల్లి గ్రామం నుంచి క్రికెట్‌లో ఆడుతున్నారన్నారు. సీనియర్ నాయకులు రామనాథం, రాము, బుచ్చిరాములు, రాఘవులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మాదిగల సత్తా చాటాలి

అచ్చంపేటటౌన్, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల సత్తాచాటాలని మాదిగ రాజకీయ ఐక్యవేదిక జిల్లా చైర్మన్ మంగి విజయ్ అన్నారు. ఈ నెల 5న పట్టణంలో నిర్వహించే సభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాదిగల ఐక్యరాజ్య సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో మాదిగలు మూడులక్షల మంది ఉన్నామని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మన మాదిగల సత్తా చాటుదామన్నారు. ఈ నెల 5న పట్టణంలోని లింగాల్ రోడ్డులో ఉన్న బీకే ప్యాలస్ హాల్‌లో నిర్వహించే మాదిగల రాజకీయ ఐక్యవేదిక సభకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగ రాజకీయ ఐక్యవేదిక నాయకులు శంకర్, అశోక్, నాగరాజు, తిరుపతయ్య, కళ్యాణ్, విజయ్, పార్వతులు, సౌట శివ, నరేష్, రాము, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు టీకాలు

కందనూలు, మే 3 : నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులకు ఈ నెల 4వ తేదీన ఉదయం 10గంటల నుంచి నాగర్‌కర్నూల్‌లోని రూబీ గార్డెన్‌లో టీకా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్.ఫరీద్‌అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మహబూబ్‌నగర్‌కు చెందిన జామియా నిజామియాకు చెందిన ఆలీమ్‌ముఫ్తీమహమ్మద్‌మౌలానా హఫీజ్ ఫైజుద్దీన్ ద్వారా శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ టీకా శిబిరాన్ని పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

ఘనంగా సయ్యద్ సద్రుద్దీన్‌షా ఉర్సు

- భక్తిశ్రద్ధలతో గంధోత్సవం -నేడు ఖాత్మేఖురాన్

కందనూలు, మే 3 : నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూలు రోడ్డులో గల సయ్యద్ సద్రుద్దీన్‌షా ఖాద్రీ రహమతుల్లా అలే ఉర్సులో భాగంగా గురువారం రాత్రి గంధోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి షేక్ ఫహీమోద్దీన్ చిస్తిఉల్‌ఖాద్రి ఆధ్వర్యంలో మహబూబ్‌సుభాని వీధిలో షేక్ నిరంజన్ నివాసం నుంచి గంధం బయల్దేరి భక్తి వచనాలు, డప్పు సాదనతో దర్గా వద్దకు భక్తిశ్రద్ధలతో చేరుకుంది. అనంతరం దర్గా వద్ద ఖవ్వాలి, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆదివారం దర్గా వద్ద చిరాగాతో పాటు ఖతమే ఖురాన్ ఇతర ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రసాద వితరణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో చర్యలు తీసుకోవాలి

బల్మూరు, మే 3 : జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమస్యాత్మకమైన గ్రామాల్లో చట్టపరంగా పోలీసులు తీసుకోవాల్సిన నియమ నిబంధనలను సిబ్బందికి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. మండలంలోని పోలిశెట్టిపల్లి, కొండనాగుల, బల్మూరు గ్రామాల్లో ఎస్పీ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అంతకు ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సిబ్బంది సమస్యలను తెలుసుకుని జరగబోయే ఎన్నికల్లో సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని సూచించినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

ఉప్పునుంతల, మే 3:: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్పీ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉప్పునుంతలలో అచ్చంపేట ఎన్నికల ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌తో కలిసి మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల స్పందన చూస్తే ఆర్‌ఎస్పీ గెలుపు ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలే ఆర్‌ఎస్పీని గెలిపిస్తుందన్నారు. కేంద్రంలో తెలంగాణ వాణి వినిపించాలంటే ఆర్‌ఎస్పీ గెలిపించుకోవాలని ఆయన సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు రవీంద్రారావు, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, నాయకులు గోపాల్‌రెడ్డి, బాలునాయక్, శంకర్, ఎల్లయ్య, చిన్నజంగయ్య, బాలస్వామి, రాంప్రసాద్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి వేగవంతం

చారకొండ, మే 3: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి వేగవంతం అవుతుందని అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్‌లు అన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపుకోసం మండలంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. మహేందర్, ఎంపీటీసీ గ్యార లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగారం లక్ష్మయ్యగౌడ్, గజ్జె కొండలయ్య గౌడ్, కేశమోని శంకర్‌గౌడ్, కందికంటి శ్రీనయ్యగౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, గుండె శివగౌడ్, గోరటి శివ, సత్తార్, వేముల రవిగౌడ్, ప్రసాద్‌గౌడ్, జూలురు లక్ష్మయ్యగౌడ్, నర్సింహాచారి, వీరబోజ, రామకృష్ణ, రామస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఉప్పునుంతల, మే 3:: మండల పరిధిలోని తాడూరు గ్రామంలో అనారోగ్యంతో ఒగ్గు బారతమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకొని శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కాకునూర్ బ్రహ్మచారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్థిక సహాయం అందించారు. వెంకటేష్ తదితరులు ఉన్నారు.